నెల్లూరులోకి గూడూరు.. మదనపల్లికి పుంగనూరు..

నేడో రేపో ఉత్తర్వులు..?

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ చేసిన జిల్లాల పునర్వ్యవస్థీకరణ సరిగ్గా లేదని రాష్ట్రవ్యాప్తంగా ఫిర్యాదులు రావడంతో కూటమి ప్రభుత్వం తిరిగి జిల్లాల పునర్విభజనకు నడుం బిగించింది. ఇందుకోసం మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో ఐదుగురితో కమిటీ వేసింది. అనగాని నేతృత్వంలో ఏడాదిపాటు అన్ని నియోజక వర్గాలు, మండలాల నుంచి అందిన ఫిర్యాదులపై ఆయా ప్రాంతాలకు వెళ్లి ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. రాష్ట్రంలో మదనపల్లి, మార్కాపురం, అమరావతి జిల్లాలను అదనంగా ఏర్పాటు చేయాలని నిర్ధారణకు వచ్చారు. రాష్ట్రంలో జిల్లాల్లో కలిపిన నియోజకవర్గాలు సుదూరంగా ఉన్నాయని కమిటీకి వినతులు రావడంతో వాటిలోనూ మార్పులు చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు జిల్లాల పునర్విభజన కమిటీ మరోసారి సోమవారం తుది సమావేశం అయ్యింది. సుదీర్ఘంగా చర్చించారు. నెల్లూరు జిల్లాలోకి గూడూరు నియోజకవర్గం మండలాలైన గూడూరు, కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, సర్వేపల్లిలు ఉండగా సర్వేపల్లి తప్ప మిగిలినవన్నీ తిరుపతి జిల్లాలో కలిసాయి. గూడూరు నియోజకవర్గం నెల్లూరుకు దగ్గరగా ఉంటుందని, అరగంటలో చేరుకోవచ్చుని, తిరిగి నెల్లూరు జిల్లాలో కలపాలని వినతులు ఇచ్చారు. నారా లోకేష్ యువగళంలోనూ ఈ మేరకు హామీ ఇచ్చి ఉన్నారు. తిరిగి నెల్లూరు జిల్లాలో కలపనున్నట్లు తెలుస్తోంది. తిరుపతి జిల్లాకు సమీపంలో ఉన్న వడమాలపేట, పుత్తూరులను అప్పటి మంత్రి ఆర్‌కె రోజా తిరుపతి జిల్లాలో ఉండేలా నిర్ణయించారు. నింద్ర, విజయపురం, నగరి మండలాలు చిత్తూరు జిల్లాలోనే ఉండి పోయాయి. నగరి ఎంఎల్‌ఎ గాలి భానుప్రకాష్ మూడు మండలాలను తిరుపతి జిల్లాలో కలపాలని కమిటీకి విన్నవించారు. ఈ మేరకు సానుకూలంగానే స్పందించి నట్లు తెలుస్తోంది. భౌగోళిక రీత్యానూ తిరుపతి జిల్లాలోనే ఉండటం అని భావించారు. ఇప్పటివరకూ 31 మండలాలు ఉన్న చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గ ప్రజల ఆకాంక్షల మేరకు సమీపంలోని మదనపల్లి జిల్లాలోకి బదిలీ కానున్నాయి. పుంగనూరు, చౌడేపల్లి, సోమల, సదుం, రొంపిచెర్ల మండలాలు మదనపల్లిలో కలుస్తాయి. తిరుపతి జిల్లాలో కలపాలని ప్రతిపాదన ఉండడంతో చంద్రగిరిలో పాత పద్ధతిలో పులిచెర్ల రానుంది. ప్రస్తుతం తిరుపతి జిల్లాలో 34 మండలాలు ఉండేవి. గూడూరు పోక, నగరి, పులిచెర్ల రాకతో 33గా ఉండనుంది. ఒక్క మండలం తగ్గుతుంది. అదే చిత్తూరు జిల్లాలో కొత్తగా ఏర్పడిన చిత్తూరు రూరల్ కలిపితే 31 మండలాలుగా ఉంది. 22 మండలాలు ఉంటాయి. శాంతిపురం మండలం రాళ్లబూదు గూరును మండలంగా ప్రకటిస్తానని హామీ ఇచ్చారు. వి.కోటను రెండు మండలాలు చేయనున్నారు. ఇదే గనక జరిగితే చిత్తూరు జిల్లాలో 24 మండలాలుగా పునర్విభజన కానుంది.

పింఛను టెన్షన్!

- ఐదు ఏళ్లుగా నిరీక్షణ
- అర్హత వున్నా అందని వికలాంగుల పింఛను

ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం): సంక్షేమం, అభివృద్ధి తమ ధ్యేయమని రెండింటినీ అమలు చేస్తామని, సంక్షేమ కార్యక్రమం అమలులో భాగంగానే అర్హులందరికీ పింఛను అందిస్తామని ముఖ్య మంత్రి పదేపదే సమావేశాల ప్రసంగా ల్లో ఊదరగొడుతున్నారు. అయితే క్షేత్ర స్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా వుంది. ఇటీవల ఆర్థిక భారం తగ్గింపు పేరుతో కూటమి ప్రభుత్వం వికలాంగుల పింఛన్లలో కోత పెట్టింది. అర్హులందరికీ పింఛన్లు కొనసాగిస్తామని చెప్పినా ఎక్కడా అమలు కావడంలేదు. ఇక కొత్త పింఛన్లు మంజూరు విషయం పట్టించుకోవడంలేదు. అర్హత వున్నా ఐదేళ్లుగా అధికారులు, ప్రభుత్వ కార్యా లయాల చుట్టూ తిరుగుతున్నా తనకు వికలాంగ పింఛను అందడంలేదని ఓ అభాగ్యుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

పింఛన్ కోసం ఐదేళ్లుగా ఎదురుచూస్తున్న హుస్సేన్

పింఛన్ టెన్షన్!

గంగవరం మండలం దండపల్లి పంచాయతీ నాగిరెడ్డి పల్లికి చెందిన ఎస్ హుస్సేన్ ఐదు సంవత్సరాలుగా పింఛను కోసం ఎదురుచూస్తున్నాడు. తాను గతంలో ఆరోగ్యంగా ఉండి మేస్త్రి పని చేసుకుంటూ జీవనం సాగించే వాడినని, తనకు ఇద్దరు కుమారులు ఉన్నారని తెలిపాడు. ఎనిమిది సంవత్సరాల క్రితం షుగర్ వ్యాధి ఎక్కువ కావడంతో ఆసుపత్రి పాలైన తనకు ఒక కాలు పాదాన్ని సగభాగం తొలగించారని ఇంకొక్క కాలు సచ్చుబడిపోయి కుర్చీకే పరిమిత మయ్యాయని విచారం వ్యక్తం చేశాడు

ఐదు ఏళ్లుగా నిరీక్షణ

ఐదు సంవత్సరాల క్రితం పింఛను కోసం దరఖాస్తు చేసుకుని ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరిగి విసిగిపోయానని ఆవేదన వ్యక్తం చేశాడు. రెండు పర్యాయాలు కలెక్టర్ వద్దకు వెళ్లి వినతి పత్రం కూడా అందించానని తెలిపాడు. అయినా అధికారులు ఎలాంటి కనికరం చూప లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఎదురు చూసి చూసి ప్రయోజనం లేకపోవడం తో దిక్కుతోచని అయోమయ స్థితిలో వున్నానని తెలిపాడు.

అర్హత వున్నా అందని వికలాంగుల పింఛను

కదలేని స్థితిలో వున్న తాను వికలాంగ పింఛనుకు అర్హుడినైనా ఇంత వరకు ఎలాంటి పింఛను మంజూరు చేయలేదని హుస్సేన్ తెలిపాడు. ప్రస్తుతం తాను భార్య పిల్లలను పోషించడానికి కూడా వీలు లేక పోయిందని తన భార్య కూలి పనులు చేసు కుంటూ వచ్చే కూలి డబ్బుతో సంసారం గడు పుతున్నానని తెలిపింది. సంబంధిత అధికారులు స్పందించి తనకు వెంటనే పింఛను మంజూరు చేయాలని బాధితుడు కోరుతున్నాడు.

సమస్యలు పరిష్కరించండి

కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: తమ సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు సమగ్ర శిక్ష అభియాన్‌లో 20 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర నాయకులు విల్వనాథం, జిల్లా నాయకులు కృష్ణమూర్తి గిరిధర్ మాట్లాడుతూ ఎంతోకాలంగా సమగ్ర శిక్ష అభియాన్ లో పనిచేస్తున్న తమకు ప్రభుత్వం కనీస వేతనాల అమలు, ఈఎస్ఐ, పిఎఫ్ అమలు చేయక పోవడంతో చాలీచాలని జీతాలతో పనిచేయాల్సి వస్తోం దన్నారు. ప్రభుత్వం వెంటనే హెచ్‌ఆర్ పాలసీ అమలు చేసి సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పనికి తగ్గ వేతనం చెల్లించాలని కోరారు. మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులను మంజూరు చేసి సమగ్ర శిక్ష అభియాన్ లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల పోరాటానికి యుటిఎఫ్, ఎస్‌టియు, సిఐటియు నాయకులు సంపూర్ణ మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు, ఉపాధ్యాయ సంఘాల నాయకులతోపాటు సమగ్ర శిక్ష అభియాన్, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ధర్నా అనంతరం కలెక్టర్ సుమిత్ కుమార్‌కు వినతిపత్రం అందించారు.

కలెక్టరుకు వినతిపత్రం అందిస్తున్న సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగులు

పరిష్కారంపై దృష్టి పెట్టాలి

- పిజిఆర్ఎస్ అర్జీల స్వీకరణ
- అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ సమావేశం మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) లో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి కలెక్టర్ 292 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ అర్జీలను వెంటనే స్పందించి పరిష్కారంపై పత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలకు సంబంధించిన ఆడిట్‌ను జిల్లా అధికారులు ప్రాధాన్యతగా పూర్తి చేయాలని, ఆర్డీఓలు, జిల్లా అధికారులు ప్రతివారం తనిఖీలు నిర్వహించాలని, ఆయా మండలాలకు వెళ్లినప్పుడు గ్రీవెన్స్ జాబితా సిద్ధంగా ఉంచాలని అధికారులకు ఆదేశిం చాలని, ఆర్డీవోలు, జిల్లా అధికారులు ఒకటి, రెండు అర్జీలను స్వయంగా తనిఖీ చేయాలన్నారు. దీని ద్వారా గ్రీవెన్స్ నాణ్యత తెలుసుకుని ఫీడ్ బ్యాక్ అందించాలని, క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలన్నారు. కలెక్టర్ తో పాటు అర్జీల స్వీకరణలో డిఆర్‌ఓ మోహన్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడేల్, చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, డిప్యూటీ కలెక్టర్ కరుణ కుమారి, డిప్యూటీ కలెక్టర్ వెంకట శివ, కలెక్టరేట్ ఏవో వాసుదేవన్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నియంత్రణకు కమిటీలు

కార్యాచరణ ప్రణాళిక సిద్ధం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడుకునేలా కలెక్టర్, ఎస్పిలు జూనియర్ కాలేజీలు, కళాశాలలో యాంటీ డ్రగ్స్ కమిటీల ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు జిల్లాలో డ్రగ్స్ నియంత్రణ కోసం ఈ నెల 18వ తేదీనార్కోటిక్ కమిటీ సమావేశం, రెవెన్యూ, విద్యాశాఖ, ఆర్టీసీ, సంబంధిత శాఖలతో సమీక్షా సమావేశం కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పి తుషార్ దూడి, రెవెన్యూ, విద్యా, ఆర్టీసీ సంబంధిత శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి జిల్లాను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా మార్చేందుకు, విద్యా సంస్థలకు అందుతున్న మాదకద్రవ్యాలు ఎక్కడి నుండి వస్తున్నాయి? ఎవరు సరఫరా చేస్తున్నారు? అనే విషయాలపై దృష్టి సారించి ఇతర రాష్ట్రాల నుండి జిల్లాకు మాదకద్రవ్యాల సరఫరాపై నిఘా ఉంచి కట్టడి చేసేలా కార్యచరణ ప్రణాళిక పోలీస్ శాఖ సిద్ధం చేస్తోంది.

చిత్తూరు జిల్లాలో యూనివర్సిటీలు, ఇంజనీరింగ్ మెడికల్ , డిగ్రీ కళాశాలలు, జూనియర్ కళాశాలలు, ఉన్నత పాఠ శాలల వద్ద ప్రత్యేక నిఘా పెట్టనుంది. జిల్లాలోని ఫార్మసీ మందుల షాపుల్లో తనిఖీలు పెద్ద ఎత్తున చేపట్టనున్నారు.

గట్టి నిఘా

దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉంటుంది. అలాంటి యువత డ్రగ్స్ ఇతర మత్తుపదార్థాల బారిన పడి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. డ్రగ్స్ విక్రయాల కోసం విద్యా సంస్థలను టార్గెట్ చేసుకుంటూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తూ సొమ్ము చేసు కుంటున్న మాదకద్రవ్యాల ముఠాను కట్టడి చేసేందుకు పోలీసు, రెవెన్యూ, రోడ్డు రవాణా శాఖ ప్రణాళిక బద్ధంగా వ్యవహరించి కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చిత్తూరు జిల్లాలో చిత్తూరు పరిసర ప్రాంతాలతో పాటు పలమనేరు కుప్పం ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి అనే విమర్శలు ఉన్నాయి. వివిధ పోలీస్ స్టేషన్లో గంజాయి కేసులు నమోదవుతున్నాయి. అక్రమ మార్గాల్లో డబ్బులు సంపాదించాలనుకునే కొందరు చాటుగా గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నారు.

స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేయాలి

మండల స్థాయిలో ఎంఈఓ లు, పోలీస్ శాఖ సమన్వయంతో ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి. ప్రధానంగా హైస్కూల్ విద్యనభ్యసించి విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలి. విద్యార్థులు ఇంట్లో కంటే ఎక్కువ సమయం హైస్కూల్స్, జూనియర్ కాలేజీలు కళాశాలలోనే ఉంటారని విద్యార్థుల ప్రవర్తన వారి నడవడికపై కళాశాలల యాజమాన్యాలు నిశితంగా పరిశీలించాలి. మండల స్థాయిలో వీఆర్వో, పోలీసు శాఖ మాదక దవ్యాల నిషేధ చట్టం అమలు పటిష్టంగా అమలు చేసేం దుకు కృషి చేయాల్సిన అవసరం ఉంది. విద్యా సంస్థల్లో పోలీసు, ఎక్సైజ్ ,రెవెన్యూ అధ్యాపకులు, ఉపాధ్యాయులతో డ్రగ్స్ నియంత్రణ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు.

చట్టపరమైన సమస్యలపై అవగాహన

ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీలు, కళాశాలలో యువత మత్తు పదార్థాలకు బానిస కావడం ద్వారా ఎదుర్కొనే చట్ట పరమైన అనేక సమస్యల గురించి విస్తృతంగా అవగాహన, కార్యక్రమాల ద్వారా వివరించాలి. డ్రగ్స్ నియంత్రణకు పని చేసే స్వచ్ఛంద సంస్థలను ఇందు లో భాగ స్వామ్యం చేయాలి. మండల స్థాయిలో ఎంఈఓ లు, పోలీస్ శాఖ సమన్వయంతో ప్రణాళికను సిద్ధం చేసు కోవాలి. ప్రధానంగా హైస్కూల్ విద్యనభ్యసించి విద్యా ర్థులకు ఈ అంశంపై అవగాహన కల్పించాలి. జిల్లా కు సరిహద్దుగా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు ఉండడంతో ఇతర రాష్ట్రాల నుండి డ్రగ్స్ జిల్లాకు సరఫరా అయ్యే అవకాశాలు ఉన్నందున ఆర్టీసీ అధికారులు చెన్నై, , బెంగళూరు నుండి వచ్చే ఆర్‌టీసి బస్సుల్లో తనిఖీలు నిర్వహించాలి. జిల్లాలో డ్రగ్స్ నియంత్రణకు పోలీస్ శాఖకు ప్రజలు సహకారం అవసరమని, రైల్వే స్టేషన్, బస్టాండ్, ప్రధాన కూడళ్లలో రాత్రి సమయంలో గట్టి నిఘా ఏర్పాటు, డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారాన్ని అందించేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 1972 వుంది. లేదా సంబంధిత పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలి.

అర్హులైన విద్యార్థులందరికీ

ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ ఇప్పించాలి

- 'మనబడి మన భవిష్యత్తు' ద్వారా భవనాలు పూర్తిచేయాలి
- యుటిఎఫ్ నాయకులు డిమాండ్

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: అర్హులైన విద్యార్థులందరికీ ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ ఇవ్వాలని, 'మనబడి మన భవిష్యత్తు' ద్వారా భవనాలు పూర్తిచేయాలని, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు ఇస్తున్న నాణ్యమైన బియ్యాన్ని నేరుగా పాఠశాలలకు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం యుటిఎఫ్ నాయకులు జిల్లా రెవెన్యూ అధికారి, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ లను కలిసి వినతి చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు జీవీ రమణ, సోమశేఖర్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ మణిగండన్, జిల్లా గౌరవ అధ్యక్షులు పి సుధాకర్ రెడ్డి, సహాధ్యక్షులు కే రెడ్డప్ప నాయుడు ఎస్ రెహానా బేగం, జిల్లా కార్యదర్శులు డి ఏకాంబరం, కే సరిత, కే గణేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మోడల్ ప్రాథమిక పాఠశాలలకు ఒక కిలోమీటరు పైబడి దూరం, ఉన్నత పాఠశాలలో మూడు కిలోమీటర్ల దూరం పైబడి ఉన్న ప్రాంతాల నుండి హాజరయ్యే విద్యార్థులలో 50 శాతం మందికి ట్రాన్స్‌పోర్టు అలవెన్స్ మంజూరు చేయలేదని దీన్ని వెంటనే ఇవ్వాలని కోరారు. మనబడి మన భవిష్యత్తు రెండవ ఫేజ్ 2 లో భాగంగా చాలా బడులలో భవనాలు అసంపూర్తిగా ఉన్నాయని వాటి నిర్మాణానికి వెంటనే నిధులు విడుదల చేయాలనీ విజ్ఞప్తి చేశారు. 50 శాతం స్కూల్ కాంపోజిట్ గ్రాంట్ లను త్వరిత గతిన విడుదల చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా నాణ్యమైన బియ్యం ప్రస్తుతం క్లస్టర్ సెంటర్లలో దించుతున్నారని అక్కడినుండి పాఠశాలలకు తీసుకెళ్లడం చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రధానోపాధ్యాయులు తెలిపారని జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ కుమార్‌కు వివరించారు. బియ్యం నేరుగా పాఠశాలలకు చేరవేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని గతంలో లాగా రేషన్ డీలర్లకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

డిఆర్‌వోకు వినతిపత్రం అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

పుస్తకాలు విద్యార్థులకు ఉపయోగపడాలి

కలెక్టర్ సుమిత్ కుమార్

స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : పుస్తక రచనలు విద్యార్థులకు ఉపయోగపడేలా ఉండాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక అనంతరం పదవ తరగతి సాంఘిక శాస్త్రంలో విద్యార్థులకు ఉపయోగ పడేలా వికోట జెడ్పీ ఉన్నత పాఠశాల (బాలుర) స్కూల్ అసిస్టెంట్ డాక్టర్ కేఎస్ కన్నన్ రచించిన కాంప్రహెన్సివ్ స్టడీ మెటీరియల్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భౌగోళిక చరిత్ర, రాజనీతి, అర్థశాస్త్రం సమ్మిళితమై స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసర్చ్ ట్రైనింగ్ నిబంధనలు అనుసరించి చేసిన రచన హయ్యర్ ఎడ్యుకేషన్, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇండియన్ స్టాండర్డ్ బుక్ నెంబర్‌తో ఆమోదం పొందడాన్ని కలెక్టర్ అభినందించారు. ఈ రచన, పదవ తరగతి ఉపాధ్యాయు లకు, విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇలాంటి పుస్తకాలను మరిన్ని రచించాలని టీచర్ కన్నన్‌కు సూచించారు. ఈ పుస్తకాలను పేద విద్యార్థులకు ఉచితంగా ఇవ్వడాన్ని కలెక్టర్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పడాల్, డిఆర్‌ఓ కే మోహన్ కుమార్ పాల్గొన్నారు.

దామోదరాచారికి ఉత్తమ కవి అవార్డు

ప్రజాశక్తి -యాదమరి : యాదమరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆర్ట్ మాస్టర్ కె దామోదరాచారి రచించిన కవితకు రాష్ట్రస్థాయి ఉత్తమ బహుమతి లభించింది. అమరావతి లో రెండు రోజులపాటు నిర్వహించిన జాతీయ సాంస్కృతిక ఉత్సవాలలో భాగంగా ఆంధ్రప్రదేశ్ టూరిజం శాఖ, మల్లెతీగ మాసపత్రిక సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి కవితల పోటీల్లో కె దామోదరాచారి రచించిన 'భారతీయతను పొగుడుదాం' అనే కవిత ఉత్తమ కవిత అవార్డుకు ఎన్నిక కావడంతో దుశ్శాలువా, నగదు బహుమతితో పాటు జ్ఞాపికతో సంస్థ వారు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కవితా పోటీలలో మొత్తం 408 కవితలు రాగా అందులో 8 ఉత్తమ కవితలు ఎన్నిక చేశారు. అందులో కె దామోదరాచారి కవిత ఒకటి. దేశభక్తి, సామాజిక స్పృహ, మానవతా దృక్పథంతో కూడిన చిత్రాలు, కవితలు, కథలు, నాటకాలు ఎన్నో ఆయన రచించారు. భారతీయతను పొగుడుదాం' అనే కవితలో మనిషి ఎంత ఎదిగిన తన మూలాలు మర్చి పోకూడదని విదేశీ మోజులో తమ శక్తి సామర్థ్యాలను విజ్ఞాన వికాసాలను విదేశాలకు పంచకూడదని ఎంతో గొప్ప చరిత్ర కలిగిన మన దేశం గొప్పతనాన్ని గుర్తించాలని చారిత్రాత్మక ప్రదేశాలను సంచరించాలని ఒక భారతీయుడుగా గర్విస్తూ జీవించాలని చాటి చెప్పే అంశాలతో రచించిన కవితకు అవార్డు లభించడం విశేషం. గతంలో రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతి, గుర్రం జాషువా అవార్డు, దేవులపల్లి కృష్ణశాస్త్రి అవార్డు, ఉత్తమ, ప్రథమ ,ద్వితీయ ,తృతీయ బహుమతులు అనేకం ఆయన పొందారు. అనేక రచనలు చేశారు.

అవార్డును స్వీకరిస్తున్న దామోదరాచారి

వెట్టి చాకిరి నుండి విముక్తి

- సిపిఎం ఫిర్యాదుతో స్పందించిన కలెక్టర్
- ఆర్‌డీవోకు అప్పగించిన అధికారులు
- ఇటుక బట్టీల కార్మికులకు విముక్తి

ప్రజాశక్తి -చిత్తూరు (యాదమరి): చిత్తూరు జిల్లా గుడిపాల మండలం గొల్లకండ్రిగ వద్ద చిత్తూరు-వేలూరు జాతీయ రహదారిని అనుకుని వున్న ఇటుక బట్టీలో రెండేళ్లుగా తమిళనాడుకు చెందిన కుటుంబాలు, 18 ఏళ్ల నిండని వారు సైతం వెట్టిచాకిరిలో మగ్గుతున్నారని సిపిఎం వేలూరు జిల్లా సభ్యులు ఆ జిల్లా కలెక్టర్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన అధికారులు చిత్తూరు కలెక్టర్‌కు సమాచారం అందించడంతో గుడిపాల మండల తహశీల్దారు ఆ ప్రాంతంలోని ఇటుకల బట్టీ వద్దకు సోమవారం వెళ్లి పరిశీలించారు. వెట్టిచాకిరిలో మగ్గుతున్న కార్మికులకు విముక్తి చేశారు. వారిని కలెక్టర్‌కు అప్పగించారు.

గుడిపాల మండలం గొల్ల కండ్రిగ గ్రామం తమిళనాడు రాష్ట్ర సరిహద్దు వద్ద ఇటుక బట్టీలలో రెండు సంవత్సరాలుగా మగ్గుతున్న తమిళనాడుకు చెందిన మూడు కుటుంబాలను చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు ఇటుక బట్టీలను సందర్శించి అక్కడ పనిచేస్తున్న గుడియాత్తం తాలూకాకు చెందిన మూడు కుటుంబాల వారు13 మందిని వెట్టి చాకిరి నుండి విముక్తి కల్పించారు. ఇందులో ఆరుగురు పెద్దలు, ఏడుగురు బాల కార్మికులు, గుడియాతం రెవెన్యూ డివిజనల్ అధికారికి వీరిని చిత్తూరు ఆర్డీవో ఆదేశాల మేరకు విలేజ్ రెవెన్యూ అధికారి యశ్వంత్ నాయుడు ఆధ్వర్యంలో అప్పగించారు.

ఇటుక బట్టి యజమాన్యంపై ఫిర్యాదు

తమిళనాడు చిత్తూరు జిల్లా సరిహద్దుల్లో గుడిపాల గొల్ల కండ్రిగ తమిళనాడు సరిహద్దు వద్ద గిరిజన కూలీలను రెండు సంవత్సరాలుగా బంధించి పని చేయించుకుంటూ ఇబ్బంది పెడుతున్న ఇటుకబట్టి యాజమాన్యంపై చర్య తీసుకోవాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు ఆదివారం కలెక్టర్ కి ఫిర్యాదు చేశారు.

కలెక్టర్‌కు అభినందనలు

సోమవారం కలెక్టరేట్లో వాడ గంగరాజు మాట్లాడుతూ ఇటుకబట్టి కార్మికులు, బాల కార్మికులను విముక్తి చేయడంలో కలెక్టర్ కృషి అభినందనీయమని కలెక్టర్‌కి అభినందనలు తెలిపారు. చిత్తూరు ఆర్డీవో గుడిపాల తహశీల్దారును సంప్రదించి సోమవారం కార్మికులకి రిలీజింగ్ ఆర్డర్స్ ఇచ్చి వేలూరుకి పంపించారని తెలిపారన్నారు. జిల్లాలో ఇంకా అనేక చోట్ల వెలుగు లోని రాకుండా ఇలాంటివి ఉన్నాయని లేబర్ అధికారులు, తహశీల్దారులు ఇలాంటి ఘటనలపై క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 238 మంది ఎంపిక

ప్రజాశక్తి -కుప్పం: కుప్పం డిగ్రీ కళాశాల ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 238 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల వైస్ చైర్మన్ సాగర్ రాజ్ తెలిపారు. బంధం బ్యాంక్, ఎంఆర్ఎఫ్ అరక్కోణం, జి ఐ గ్రూప్ టాటా ఎలక్ట్రానిక్ మాన్ పవర్ గ్రూప్ తదితర కంపెనీలు ఆధ్వర్యంలో సోమవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో 238 క్యాంపస్ సభ్యుల ద్వారా ఎంపికయ్యారని వీరికి కళాశాలలో గతంలో దశలు వారీగా నిర్వహించిన ప్లేస్మెంట్ ట్రైనింగ్ కార్యక్రమాలు ఎంతో ఉపయోగ పడ్డాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుధారాణి ప్లేస్మెంట్ ఆఫీసర్ పార్థీ బన్,అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో ఎంపిక సిబ్బంది

ఇటుక రాళ్ల ట్రాక్టర్ బోల్తా

- ఇద్దరు దుర్మరణం
- ఓ మహిళా కూలీకి తీవ్ర గాయాలు
- డ్రైవర్ పరారీ

ప్రజాశక్తి -కార్వేటినగరం: ఇటుకరాళ్ల లోడుతో వెళుతున్న ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరు దుర్మరణ చెందిన సంఘటన మండల పరిధిలోని సురేంద్రనగరం కనుమ వద్ద సోమవారం చోటు చేసుకుంది. ట్రైనీ ఎస్ఐ రమేష్ కథనం మేరకు.. పుత్తూరు నుంచి కార్వేటినగరం వైపు ఇటుక రాళ్ల లోడ్డుతో వస్తున్న ఏపీ39 డబ్ల్యూహెచ్ 6703 నెంబరు కలిగిన ట్రాక్టర్ సురేంద్రనగరం సమీపంలోని చిన్నకనుమ వద్ద చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై అదుపు తప్పి బోల్తా పడడంతో పుత్తూరు పట్టణం పిళ్లారిపట్టు వీధికి చెందిన సంతోష్ (21), వుత్తూరు పట్టణం కేటీ పురానికి చెందిన మహిళా కూలీ శెల్వి(50) మృతి చెందారు. అందులో శెల్వి ట్రాక్టర్ ట్రాలీకింద పడి ఇటుక రాళ్ల మధ్య కూరుకు పోయి దుర్మరణం చెందగా, పాతపల్లూరు గ్రామానికి చెందిన ఎం నాథ(43) ఇటుక రాళ్లపై నుంచి దూరంగా పడడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. దీంతో చికిత్స నిమిత్తం 108 సాయంతో పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ట్రాక్టర్ డ్రైవర్ మణి పరారీలో ఉన్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. సమాచారం అందుకున్న మృతుల కుటుంబాలు ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని బోరున విలపించడంతో ఆ ప్రాంతం శోకసంద్రంగా మారింది.

బోల్తా పడిన ఇటుక రాళ్ల ట్రాక్టర్

మృతి చెందిన మహిళా కూలీ శెల్వి

మృతి చెందిన సంతోష్

72 చెరువులకు వేలం

ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం): గంగవరం మండలం పలు పంచాయతీలో చేపల చెరువులకు వేలం వేయడంతో పంచాయతీకి 10 లక్షల 83 వేల వంద రూపాయలు ఆదాయం పొందినట్లు పిఆర్ఏఈ ప్రసాద్ తెలిపారు. ఇందులో గంగవరం పంచాయతీలో 16 చెరువులు, కలగటూరు ఏడు, చౌడిరెడ్డిపల్లి ఐదు , గంటరాజుపల్లి 12, కేలపల్లి ఐదు, పత్తికొండ 14, దండపల్లి 8, కల్లుపల్లి ఐదు చెరువులకు వేలం వేశారు. 72 చెరువులకు పది లక్షల 83 వేల వంద రూపాయలు ఆదాయం లభించిందని పిఆర్ఏఈ పేర్కొన్నారు.

రైతుల్ని ఆదుకునేందుకే 'అన్నదాత సుఖీభవ'

జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి

ప్రజాశక్తి -బంగారుపాలెం: రైతులను ఆదుకునేందుకే అన్నదాత సుఖీభవ అని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని 170 గొల్లపల్లిలో రైతు మీకోసం కార్యక్రమం

వ్యవసాయ అధికారి భారతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులని ఆదుకునేందుకు అన్నదాత సుఖీభవ ప్రారంభించిందని. రాష్ట్ర ప్రభుత్వం 14 వేలు రూపాయలు కేంద్ర ప్రభుత్వం ఆరువేల రూపాయలు ప్రతి సంవత్సరం రైతుకు 20వేల రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోకా ప్రకాష్ నాయుడు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం : వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వందన త్రిపాఠి అన్నారు. సోమవారం ప్రపంచ హెచ్ఐవి నివారణా దినోత్సవ కార్యక్రమాన్ని ఐసిటిఎస్ కౌన్సిలర్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ఐవి ఒకరి నుండి ఒకరికి సోకే వ్యాధి అని దీనివల్ల ప్రాణహాని వుందని ముందస్తు హెచ్ఐవిని గుర్తించి తగిన చికిత్సలు తీసుకుంటే వ్యాధి బారిన పడకుండా కాపాడు కోవచ్చన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి హెచ్ఐవి నిర్మూలిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డిపిఎం మనీ టీ బి సూపరువైజర్ శివకుమార్ ప్రకాష్, జయచంద్ర, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మురళి పాల్గొన్నారు.

నాగ పడగలకు రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి -కుప్పం: కుప్పం శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ ఆలయంలో అమ్మవారికి తొమ్మిది తలల నాగ పడగలు చేసేందుకు

గోపీనాథ్ కుటుంబం లక్ష విరాళం అందించింది. సుమారు 27 కేజీలతో నాలుగు అడుగులు వెడల్పు 9 తలల నాగ పడగలు చేసేందుకు ఆలయ కమిటీ సభ్యులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా స్వచ్ఛందంగా భక్తులు పాత వెండితోపాటు విరాళాలు అందజేస్తున్నారు. దీంతో గోపి నాథ్ కుటుంబ సభ్యులు లక్ష రూపాయల విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ బిఎంకె రవిచంద్రబాబుకు అందించారు. ఈ కార్యక్రమంలో విస్తరణ కమిటీ సభ్యులు మంజునాథ్,కమిటీ సభ్యులు వినాయకన్, మహేష్, నరేష్, శారదమ్మ కంద స్వామి, వెన్నెల శరవణ, వి ఎస్ లక్ష్మి ఆనంద కృష్ణమూర్తి, జ్యోతిష్, సైదులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి: టిడిపి

ప్రజాశక్తి -చౌడేపల్లి: స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని రాష్ట్ర పాల ఏకరుల చైర్మన్ నాగేశ్వర్ నాయుడు అన్నారు. సోమవారం స్థానిక శ్రీ లక్ష్మి శ్రీనివాస కళ్యాణ

మండపంలో టిడిపి సంస్థాగత ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి రానున్న ఎలాంటి ఎన్నికలకు సన్నద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ముఖ్యంగా మహిళల కోసం ప్రభుత్వం చేసిన కృషిని వివరించాలన్నారు . నూతనంగా ఏర్పాటైన గ్రామ పట్టణ కమిటీలు పార్టీ లక్ష్యాలను అధిగమించాలన్నారు. చౌడేపల్లి పట్టణంలో కె ఎస్ ఎస్ సభ్యుల పేర్లను చదివి వినిపించారు. నూతన కమిటీ అధ్యక్ష పదవి ఎంపికలో వాయిదా వేశారు. అనంతరం పార్టీ విధివిధానాలను నాయకులు కార్యకర్తలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు రమేష్ రెడ్డి , పార్టీ సీనియర్ నాయకులు మాదిరాజు లక్ష్మణ పతి రాజు, మాదిరాజు ప్రదీప్ రాజు, రామచంద్రయ్య, మాజీ ఎమ్మెల్యే బగిడి గోపాల్, సింగిల్ విండో చైర్మన్ హరి ప్రసాద్ రాయల్ పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : కార్మికులు దశాబ్దాల పాటు విరోచత పోరాటాలు చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం కాలరాసేందుకు దుర్మార్గంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ పట్టణ నాయకులు మురళి, శేఖర్ అధ్యక్షతన బస్టాండు ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన నిరసనలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి వేలన్, ఏఐటీయూసీ నాయకులు రాజేంద్ర భాషా, అహ్మద్ , శిరావుద్దీన్, సతీష్, సురేష్, యేసయ్య పాల్గొన్నారు.

మాతా శిశు మరణాలపై సమీక్ష

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టిటి సుధారాణి ఆదేశాలతో జిల్లాలో అక్టోబర్ లో జరిగిన ఒక మాతా శిశుమరణంపై, 17 శిశు మరణాలపై డాక్టర్లు సిబ్బందితో డిఐఓ డాక్టర్ హనుమంతరావు సోమవారం ప్రత్యక్ష సమీక్ష నిర్వహించారు. హై రిస్క్ గర్భిణులపై ప్రత్యేక నిఘా అవసరమని, గర్భస్థ సమయం నుంచి కాన్పు అయ్యే వరకు తప్పని సరిగా డాక్టర్లు నాలుగు చెకప్‌తో పాటు పౌష్టికాహారం , హైరిస్కు లక్షణాలు, రక్తహీనత తదితర వాటికి ఎప్పటికప్పుడు చికిత్స చేస్తూ అత్యవసరమైతే పెద్ద ఆస్పత్రికి రిఫర్ చేసి సులభ కాన్పు అయ్యేటట్లు చూడాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా టీనేజీ ప్రెగ్నెన్సీ పై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ప్రతి నెల పిహెచ్‌సిలో జరిగే ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ 9వ తేదీ ఖచ్చితంగా అందరూ గర్భిణులకు పరీక్షలు నిర్వహించి, పౌష్టికాహారం పై సూచనలు ఇచ్చి మందులు పంపిణీ చేయాలన్నారు. ఎవరికైనా గర్భిణీకి క్లిష్టతర సమస్యలు ఉంటే (గుండెజబ్బులు, థైరాయిడ్, బిపి ,షుగర్)వారికి ప్రత్యేకంగా చికిత్స చేయించాలన్నారు. హైరిస్క్ గర్భిణీలను ముందస్తుగానే గుర్తించి వారికి ప్రత్యేక చికిత్స, రిఫరెన్స్, ఒక వారం ముందే ఆసుపత్రి నందు జాయిన్ చేయించుట, సులభకాన్పు అయ్యేలాగా చూడాలని తెలిపారు. తక్కువ బరువుతో పుట్టిన చంటి బిడ్డలకు, ఏదైనా చిన్న సమస్య ఉన్న వెంటనే పిల్లల డాక్టర్ దగ్గరకు పంపి చికిత్స చేయించాలన్నారు. ప్రతినిత్యం గర్భస్థలపై ఆశ కార్యకర్త ఏఎన్ఎం లో ప్రత్యేక నిఘా ఉంచి ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటే శిశు మరణాలు జరగకుండా చూడొచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉషశ్రీ, డాక్టర్ లత, డాక్టర్ అయేషా, డాక్టర్ డోన సెట్టర్, డాక్టర్ ప్రశాంతి, రోజారాణి, వెంకటేశ్వరి, మోహన్ బాబు,కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభకు అభినందన

విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-సోమల: జెవివి నిర్వహించిన సైన్స్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రధానో పాధ్యాయులు సోమవారం అభినందించారు. సోమల మండలం నంజంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ జన విజ్ఞాన వేదిక నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబరాలు 2025 వేడుకలలో భాగంగా అక్టోబర్ 30వ తేదీ పాఠశాల స్థాయిలో, ఈ నెల 5వ తేదీ మండల స్థాయిలో, 23న జిల్లా స్థాయిలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో తమ పాఠశాలకు చెందిన పదవ తరగతి మునిష్, 9వ తరగతి కావ్య శ్రీ, 8వ తరగతి లాస్య శ్రీలు ప్రతిభ చూపి పాఠశాలకు ఉత్తమ పేరు తీసుకువచ్చారని హెచ్ఎం కుసుమాంబ తెలిపారు. టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

స్వామిత్వ గ్రామసభ

ప్రజాశక్తి -సోమల: మండలంలోని పొదల కుంట పల్లి, నంజంపేట సచివాలయాల వద్ద స్వామిత్వ గ్రామ సభ లను నిర్వహించారు.

సర్వే పత్రాలు అందిస్తున్న అధికారులు

నంజంపేటలో ఎంపీడీవో సివిఎస్‌వి ప్రసాద్, పొదలకంట పల్లెలో డిప్యూటీ ఎంపీడీవో లక్ష్మీదేవి పాల్గొని స్వామిత్వ సర్వేలో పంచాయతీల పరిధిలో ఇళ్ల కొలతలు, ఖాళీ స్థలాల కొలతలు నమోదు చేశామని అభ్యంతరాలు ఉంటే తెలపాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నవాజ్, మణికుమార్, సచివాలయ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

రైతులతో సమావేశం నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు

రైతుల అభ్యున్నతికి కృషి: టిడిపి

ప్రజాశక్తి- రామకుప్పం: రైతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని టిడిపి రాష్ట్ర నేత మునస్వామి, టిడిపి మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనంద రెడ్డి, ఆంజనేయ రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని బందార్లపల్లి పంచాయతీ, గడ్డురు గ్రామంలో సోమవారం వ్యవసాయ శాఖ, సెరికల్చర్, ప్రకృతి వ్యవసాయం, పశు సంవర్ధక శాఖల రైతులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా గ్రామాల్లో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వచ్చే పంటలను సాగు చేయాలన్నారు. రైతులు పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధర, కొనుగోలు, సబ్సిడీ ఎరువులు, విత్తనాలు అందించారన్నారు. పశువుల పెంపకంతో పాల ఉత్పత్తిని పెంచాలన్నారు. పట్టుగూళ్ల రైతులు మల్బరీ సాగుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కార్యదర్శి కామరాజు నాయక్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు నరసింహులు, రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్, రెస్కో డైరెక్టర్ సతీష్, సింగిల్ విండో చైర్మన్ రఫీ, జనసేన భాస్కర్, సుబ్రహ్మణ్యం, లక్ష్మీనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -కుప్పం: కుప్పం మున్సిపాల్టీ పరిధిలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డు మురుగన్ టాకీస్ రోడ్డు అంగన్వాడీ కేంద్రంలో, 12వ వార్డు శికార్ కాలనీ పాఠశాల ఆవరణంలో ప్రత్యేక ఆధార్ క్యాంపును 24 నుండి 26వ తేదీ వరకు నిర్వహిస్తారన్నారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఆధార్ అప్‌డేట్ చేస్తారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆధార్ క్యాంపులను కమిషనర్, స్థానిక కౌన్సిలర్లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జిమ్ దాము,ఎంఆర్ సురేష్, వన్య కుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ వేణు పాల్గొన్నారు.

సమస్యలు త్వరగా పరిష్కరించాలి: తహశీల్దారు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని తహశీల్దారు అధికారులను ఆదేశించారు. మండల తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 25 అర్జీలు తహశీల్దారు లోకనాథ పిళ్లై స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. మొత్తం 25 సమస్యలు అందాయని వాటిలో ఐదు అక్కడికక్కడే పరిష్కరిం చామని తెలిపారు. మిగిలిన వాటిని త్వరలో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అర్జీదారులు,

అర్జీలు స్వీకరిస్తున్న తహశీల్దారు

రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో అధ్యాపకుల ప్రతిభ

ప్రజాశక్తి -విజయపురం (నగరి): శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలలు, విశ్వ విద్యాలయం బోధనా సిబ్బందికి నిర్వహించిన క్రీడా పోటీల్లో స్థానిక నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు ఉత్తమ ప్రతిభ కనబరచి పలు పోటీల్లో విజేతలుగా నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు వేణుగోపాల్ తెలిపారు. త్రో బాల్ లో అధ్యాపకురాలు డాక్టరు ఇందిరా ప్రియదర్శిని, డాక్టరు అరుణ కుమారి విజేతలు గాను, బాల్ బ్యాడ్మింటన్‌లో రన్నరప్‌గా నిలిచారన్నారు. టెన్నిస్ విభాగంలో సింగిల్స్ విజేతగా

అధ్యాపకులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

డాక్టరు భాస్కర రాజు నిలిచారన్నారు. విజయం సాధించిన అధ్యాపకులను ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపకులు సోమవారం అభినందించారు.

రాష్ట్ర పోటీల్లో తేజశ్రీకి తృతీయ స్థానం

ప్రజాశక్తి -కుప్పం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో భాగంగా అండర్-14 యోగా పోటీలు గత రెండు రోజులుగా బాపట్ల పట్టణంలో ఘనంగా నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన అథ్లెట్లు తమ ప్రతిభను ప్రదర్శించిన ఈ పోటీల్లో కుప్పం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని తేజశ్రీ రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపింది. చిత్తూరు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తూ పోటీల్లో పాల్గొన్న తేజశ్రీ అద్భుత నైపుణ్యంతో ప్రేక్షకుల ప్రశంసలు పొందింది. సంపూర్ణ ఏకాగ్రత, కఠిన సాధనతో మెరుగైన ప్రదర్శన ఇచ్చిన తేజశ్రీ రాష్ట్రస్థాయి పోటీల్లో మూడవ స్థానాన్ని దక్కించుకుని రాష్ట్ర విజేతగా నిలిచింది. కుప్పం పట్టణంలోని జయప్రకాష్ రోడ్డులో నివాసం ఉండే తేజశ్రీ ఎనిమిదవ తరగతి

విద్యార్థిని తేజశ్రీ పట్ల ఉపాధ్యాయులు, ఆనందం వ్యక్తం చేశారు.

వినతుల స్వీకరణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : నగరపాలక కార్యాలయంలో సోమవారం "ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పీజీఆర్ఎస్) నిర్వహించారు. కమిషనర్ పి నరసింహ ప్రసాద్ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించారు. ఫిర్యాదులపై క్షేత్రస్థాయి విచారణ చేసి సత్వరం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. పీజీ ఆర్ఎస్ లో అందే ప్రతి ఫిర్యాదుపై తప్పనిసరిగా క్షేత్రస్థాయి విచారణ చేసి నివేదిక సమర్పించాలన్నారు. సోమవారం నాటి కార్యక్రమంలో ఐదు వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ ఎ ప్రసాద్, ఎంహెచ్వో డాక్టరు పి లోకేష్, ఎంఈ వెంకటరామి రెడ్డి, ఎసీపీ నాగేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆలయ భూమి పూజలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : చిత్తూరు రూరల్ మండలం పెరుమాళ్ళ కండిగ గ్రామంలో నూతనంగా నిర్మించనున్న ద్రౌపదీదేవి సమేత ధర్మరాజుల స్వామి ఆలయానికి ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ భూమి పూజ చేశారు. సోమవారం ఉదయం గ్రామంలో జరిగిన ఆలయ భూమి పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి శాస్త్రోక్తంగా భూమి పూజ చేసి పునాది రాయి వేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చంద్రప్రకాష్, విజయేంద్ర బాబు, జయచంద్రబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వికలాంగులు, వృద్ధుల సహాయ పరికరాల గుర్తింపు

ప్రజాశక్తి -వికోట : మండల కేంద్రమైన వికోటలోని బాలల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన వృద్ధులు వికలాంగుల సహాయ పరికరాల గుర్తింపు శిబిరానికి విశేష స్పందన లభించింది. పలమనేరు ఆర్డిఓ భవాని ఈ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో విక లాంగులు, వృద్ధులకు అవసరమైన సహాయక పరి

శిబిరాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఓ భవాని

కరాలు పంపిణీ నమోదు కార్యక్రమాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సామాజిక న్యాయం, సాధికారిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వికలాంగులు, వృద్ధ పౌరుల శారీరక అవసరాలను గుర్తించడం వారికి అవసరమైన సహాయక పరికరాలను గుర్తించే కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిందన్నారు . ఈ కార్యక్రమానికి పలమనేరు మున్సిపాల్టీ పలమనేరు, వికోట, బైరెడ్డిపల్లి, గంగవరం, పంజాని మండలాలు చెందిన వారు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ శిబిరంలో తమ పేర్లను నమోదు చేసుకున్నారు. విభిన్న ప్రతిభావంతులు సమాజంలో ఎవరికీ తక్కువ కాదని వీరిలో ఆత్మవిశ్వాశం పెంపొందించేందుకు ఈ శిబిరాలు దోహదపడతాయన్నారు. అంగవైకల్యం కలిగిన వారు పేర్లు నమోదు చేసుకుంటే అర్హులుగా గుర్తించిన వారికి ఉచితంగా పరికరాలను అందిస్తామన్నారు. ఈ శిబిరానికి విచ్చేసిన వికలాంగులకు స్థానిక ఎన్‌సిసి విద్యార్థులు సహాయ సహకారాలు అందించారు. ఈ శిబిరాన్ని ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వికోట తహశీల్దారు ఉదయ సంతోష్, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, బైరెడ్డిపల్లి ఎంపీడీవో చంద్రశేఖర్ రెడ్డి, పెద్దపంజాణి ఎంపీడీవో బాలాజీ, పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎన్‌వి రమణారెడ్డి, పెద్ద ఎత్తున సచివాలయ సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి-చౌడేపల్లి: మండలంలోని దిగువపల్లి పంచాయతీ మిట్టపల్లిలో ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ నాగేశ్వరరావు కథనం మేరకు దిగువపల్లి పంచాయతీ మిట్టపల్లికి చెందిన గౌతమి (23) బెంగళూరులో సాఫ్ట్‌వేర్‌గా ఉద్యోగం చేస్తోంది. ఈ క్రమంలో బెంగళూరులోనే కార్తీక్ అనే యువకుడిని నాలుగు సంవత్సరాలుగా ప్రేమిస్తోంది. ఈ క్రమంలో పెళ్లి చేసు కుంటానని పెద్దలను అడుగగా ఇద్దరి కుటుంబాలు నిరాకరించాయి. దీంతో మనస్తాపం చెందిన గౌతమి సొంత ఇంటికి వచ్చి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలాన్ని చేరుకొని మృతదేహాన్ని పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ఆలయ ముఖద్వారాన్ని ఢీకొన్న కారు

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం మున్సిపాలిటీలోని తంజమ్మ కొట్టం శ్రీరంగనాథ స్వామి ఆలయ ముఖ ద్వారాన్ని ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని కారు ఢీకొంది. ఆలయ ముఖ ద్వారం రాతి కూసాలు ధ్వంసమయ్యాయి. రాత్రి 11.50 గంటల ప్రాంతంలో షిఫ్ట్ డిజైర్ కారు ఆలయముఖ ద్వారాన్ని ఢీకొట్టినట్లు చేసి టీవీ ఫుటేజ్ ద్వారా గుర్తించిన ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలయ ముఖ ద్వారాన్ని ఢీకొట్టిన కారు ఆగకుండా వెళ్లిపోయింది.

నేడు పలమనేరు మున్సిపల్ బడ్జెట్ సమావేశం

ప్రజాశక్తి- పలమనేరు : చిత్తూరు జిల్లా పలమనేరు పురపాలక సంఘానికి సంబంధించి బడ్జెట్ సమావేశం, సాధారణ సమావేశము ఈ నెల 25వ తేదీ ఉదయం 11 గంటలకు పలమనేరు పురపాలక సంఘంలో నీలం సంజీవ రెడ్డి కౌన్సిల్ హాల్‌లో నిర్వహించనున్నారు. పలమనేరు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ కౌన్సిలర్లు, ఎక్స్ ఎఫిషియో సభ్యులు, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు తప్పక హాజరు కావాలని పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎన్వి రమణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

భారతీయులంతా ఒక్కటే: ఎమ్మెల్సీ

ప్రజాశక్తి -కుప్పం: ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని ఏక్ భారత్ – ఆత్మ నిర్భర్ భారత్ భావజాలాన్ని ప్రజలకు చేరువ చేసేందుకు కుప్పం పట్టణంలో సోమవారం యూనిటీ మార్చ్ నిర్వహించారు. దేశ ఐక్యత, సంఘీభావం, జాతీయ సమగ్రత వంటి విలువలను యువతకు తెలియజేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టిసి వైస్ చైర్మన్ పి ఎస్ మునిరత్నం,కడ పిడి వికాస్ మర్మత్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పి కే ఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్,కడ అడ్వైజర్ కమిటీ సభ్యులు సతీష్,రామచంద్ర, జనసేన నేత నరేష్, బిజెపి నేత తులసి, పాల్గొన్నారు.

స్వామివారి సేవలో ఎమ్మెల్సీ గ్రీష్మ

ప్రజాశక్తి-ఐరాల: శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని మాజీ స్పీకర్ ప్రతిభా భారతి, ఎమ్మెల్సీ కావలి గిరీష్మ కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు, వీరికి దేవస్థానం ఈవో పెంచల కిషోర్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం చిత్రపటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే దంపతులు

ప్రజాశక్తి-పలమనేరు: టిడిపి పలమనేరు పట్టణ ప్రధాన కార్యదర్శి గిరిబాబు కుమారుడు వంశీ వివాహం సందర్భంగా శాసన సభ్యులు అమరనాథ రెడ్డి, ఆయన సతీమణి రేణుకా రెడ్డి దంపతులు వివాహ శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని వారి స్వగృహానికి టీడీపీ నాయకులతో కలసి వెళ్లి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బ్రహ్మయ్య, నాగరాజు, బిఆర్సీ కుమార్, శ్రీనివాసులు, కోటి,రమేష్, సుబ్బు,సురేష్, వెంకటేష్, మురళీలతో పాటు న్యాయవాది లోకేష్ పాల్గొన్నారు.

కుప్పంలో ముగిసిన పాకింగ్స్ మారథాన్ -2025

ప్రజాశక్తి- కుప్పం: ప్రతిరోజూ కనీసం అరగంట పాటు వ్యాయామం చేస్తే ఆస్పత్రులకు దూరంగా ఉంటారని.. ఎన్నో ఆరోగ్య లక్షణాలను కలిగి ఉంటారని కుప్పం ఆర్ఆర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ సురేష్ మునిరత్నం పేర్కొన్నారు. కుప్పం హాకింగ్స్ స్కూల్ ఆధ్వర్యంలో సోమవారం హాకింగ్స్ మారథాన్ 2025ను నిర్వహించారు. ఆరోగ్యమే మహాభాగ్యం అంటూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరు వారి జీవన గమనంలో ఎన్నో అనారోగ్య సమస్యలు, ఒత్తిడికి గురవుతుంటారని ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వ్యాయామం, వాకింగ్ చేయాలని పాఠశాల కరస్పాండెంట్ హఫీజ్ పేర్కొన్నారు. క్రిష్ణగిరి రోడ్డు వద్ద నుండి హాకింగ్స్ స్కూల్ వరకు సుమారు నాలుగు పాయింట్ ఏడు కిలోమీటర్ల మేరకు విద్యార్థులు మారథాన్ కొనసాగించారు. ఈ కార్యక్రమంలో అరుణ సింగ్,చౌహాన్,గౌతమన్, కిండర్ గార్డెన్ కోఆర్డినేటర్ నదియా, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చిత్తూరు (యాదమరి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ సోమవారం

మర్యాదపూర్వకంగా కలిశారు. కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారి తీర్థప్రసాదాలు, మొమెంటోని విజయవాడ నివాసంలో ఎమ్మెల్యే అందించారు. అనంతరం స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం పాలకమండలి నియామక పత్రాన్ని (జీవో)ను విజయవాడలోని సెక్రటేరియట్‌లో దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరి జవహర్‌లాల్‌కు ఎమ్మెల్యే అందించారు. ఈ కార్యక్రమంలో డి హరిత, కాణిపాకం పాలకమండలి చైర్మన్ మణి నాయుడు, ఐరాల మండలం టిడిపి అధ్యక్షులు హరిబాబు నాయుడు, బంగారుపాలెం మండల అధ్యక్షుడు ధరణి ప్రసాద్ పాల్గొన్నారు.

'రైతన్నా మీ కోసం' ప్రారంభం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ పేర్కొన్నారు. 'రైతన్నా మీకోసం'ను చిత్తూరు రూరల్ మండలం పెరుమాళ్ల కండ్రిగలో సోమవారం ప్రారం

రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్

భించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి రైతులతో ఆప్యాయంగా మాట్లాడారు. అన్నదాత సుఖీభవ డబ్బులు పడ్డాయా? అని ఆరా తీశారు. వ్యవసాయానికి కరెంటు సక్రమంగా వస్తుందా? వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉన్నారా? ఏమైనా సమస్యలు ఉన్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని చెప్పారు. రైతులకు యాంత్రీకరణ పనిముట్లు, గోకులం షెడ్లు మంజూరు చేస్తున్నారన్నారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఉపాధ్యక్షులు చంద్రప్రకాష్, మాజీ ఎంపీపీ జయచంద్ర నాయుడు, శశికర్ బాబు, విజయేంద్ర బాబు, వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సోమల: మండలంలోని 9 క్లస్టర్ల పరిధిలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా అధికారులు, టిడిపి నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న పలు సంక్షేమ కార్యక్రమాల వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. సోమలలో పిఎసిఎస్ చైర్మన్ శివశంకర్ సీనియర్ టిడిపి నాయకులు పీఎం మల్లికార్జున , మహేంద్ర, శివ, వెంకటరత్న, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసులు నాయుడు ,వ్యవసాయ శాఖ విఎఎ చాందిని, వీఆర్వో, మార్కెట్ యార్డ్ అధికారి పాల్గొన్నారు. నంజం పేట, ఇరికిపెంట, కందూరు, నెల్లిమంద, పెద్ద ఉప్పరపల్లి, ఎస్ నడింపల్లి, వల్లిగట్ల, 81 చిన్న ఉప్పరపల్లి పంచాయ తీలలో నాయకులు, అధికారులు ఈ కార్యక్ర మంలో పాల్గొని రైతుల సమస్యలు తెలుసుకున్నారు.

గుడిపల్లి: గుడిపల్లి మండలం సోడి గాని పల్లి గ్రామ పంచాయతీలో రైతన్నా మీకోసం 'ను రాష్ట్ర వాల్మీకి డైరెక్టర్ టిఎం బాబు నాయుడు సోమవారం ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మునుస్వామి శెట్టి, చలపతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వి కోట : రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని రాష్ట్ర వేర్ హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ రంగనాథ్ తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతన్నా మీ కోసం పి కొత్తూరు గ్రామంలో సోమవారం నిర్వహించారు. రైతుల ఇంటివద్దే రైతు సేవ కేంద్ర సిబ్బంది, రైతుల పనితీరును పరిశీలించి, ఈ కార్యక్రమం ఉపయోగాలను తెలిపే కరపత్రాలు పంపిణీ చేశారు.కుప్పం బ్రాంచ్ కెనాల్ ద్వారా హంద్రీనీవా జలాలు వీకోట మండలానికి రావడం వల్ల కలిగే ఉపయోగాలను మండల పార్టీ అధ్యక్షుడు రాంబాబు వివరించారు. రైతు సంక్షేమం కోసం మార్కెటింగ్ సదుపాయాలు ఫుడ్ ప్రాసెసింగ్, పంట మద్దతు ధరలు, ఉద్యాన పంటల సాగుకు అందిస్తున్న ప్రోత్సాహకాలను పిఎసిఎస్ చైర్మన్ నారాయణస్వామి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు సుబ్బన్న , యూనిటీ ఇన్చార్జిలు రాము, శబరీష్, ధీరజ్ , మార్కెట్ కమిటీ డైరెక్టర్ జయప్ప , వ్యవసాయ శాఖ అధికారి అప్పోజి , ఆర్ఎస్కే , పశు వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గుడిపల్లి: గుడిపల్లి మండలం సోడి గాని పల్లి గ్రామ పంచాయతీలో రైతన్నా మీకోసం'ను రాష్ట్ర వాల్మీకి డైరెక్టర్ టిఎం బాబు నాయుడు సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మునుస్వామి శెట్టి, చలపతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడిపల్లి మండలంలో రైతన్న మీకోసం కనమనపల్లిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శ్రీకాంత్, మండల టిడిపి అధ్యక్షులు సుబ్రమణి, మాజీ పార్టీ అధ్యక్షులు హేమంబార్ గౌడు, యూనిట్ ఇంచార్జ్ రాఘవ, మండల ప్రధాన కార్యదర్శి సురేష్, స్థానిక నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్వేటినగరం : అన్నదాత సుఖీభవ పథకం అన్నదాతలకు ఓ వరమని మండల టిడిపి అధ్యక్షులు చెంగల్రాయల్ యాదవ్, ప్రధాన కార్యదర్శి రాజా (ఎమ్మెల్యే సోదరులు)అన్నారు. డిఎం పురంలో రైతన్న మీకోసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వెంకటముని , శ్రీనివాసులు, నాయకులు బాబు, రమేష్ ,పాల్గొన్నారు.

కుప్పం: కుప్పం మండలం కంగుందిలో సోమవారం రైతన్న.. మీకోసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు.

తవణంపల్లెలో

తవణంపల్లె: అరగొండలో రైతన్న మీ కోసం' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉద్యానవన శాఖ ఉప సంచాలకులు మధుసూదన రెడ్డి, మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్, ఉద్యానవన అధికారి సాగరిక, గ్రామ ఆరోగ్య సహాయకులు శ్రీధర్, రెవెన్యూ అధికారులు, పాక్స్ అరగొండ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకు లు ప్రకాష్ కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

శాంతిపురం: రైతుల అభివృద్ధికే ముఖ్యమంత్రి చంద్రబాబు 'రైతన్నా.. మీ కోసం' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన రైతులను కలిసి కరపత్రాలు అందించారు.

యాదమరి: మండలంలోని అన్ని గ్రామాల్లో ' రైతన్నా మీకోసం' కార్యక్రమాన్ని యాదమరి మండల వ్యవసాయ అధికారి దీప ఆధ్వర్యంలో



యాదమరిలో

సోమవారం నిర్వహించారు. 12 కమ్మపల్లె గ్రామంలో ఈ కార్యక్రమానికి చిత్తూరు డివిజన్ సహాయ వ్యవసాయ సహాయకులు, మండల అభివృద్ధి అధికారి వీరేంద్ర,వ్యవసాయ, పశుసంవర్ధక, గ్రామ వ్యవస్థాపనా శాఖల బృందాలు హాజరై రైతు కుటుంబాలతో నేరుగా సమావేశమయ్యారు. 184 గొల్లపల్లి గ్రామంలో పిఎసిఎస్ చైర్మన్ చిత్రా నాయుడు, కినాటం పల్లి లో టిడిపి అధికార ప్రతినిధి అమరనాథ్ నాయుడు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ **శ్రీ విజయమోహన్** (ఆధార్ నెం. 3783 8706 7525) శ్రీ ఎస్.బాలసుందరం గారి కుమారుడు, (వయస్సు సుమారు 42 సంవత్సరాలు) నివాసం: నెం.55, మురుగన్ నగర్, కోయంబత్తూరు నార్త్,కోయంబత్తూరు- 641030, తేదీ: 23.03.2023న తన కార్యాలయాన్ని శ్రీ సేతు మహల్ కాంప్లెక్స్, సర్వేనెం.569/1-ఎ-2, సత్ మెయిన్‌రోడ్డు, టి.ఎన్.ఇ.బి. పవర్ హౌస్ ఎదురు, కరియంపాలయం, అన్నూరు, కోయంబత్తూరు- 641653 నుండి నెం.3/182, సర్వే నెం.92/1, కున్నంపాలయం, కొండయపాలయం, అన్నూరు తాలూకా, కోయంబత్తూరు- 641110కు మార్చు చున్న సమయంలో న్లాయింట్ తన అసలు సేల్ డాక్యుమెంట్ నెం.461/2020, తేదీ:07.03.2020 బంగారుపాళెం జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నమోదైనది, పోయినది. ఎవరికైన అది కనబడినట్లయితే దయచేసినా క్లయింట్ సెల్ నెం.99443 59997 ద్వారా లేదా క్రింద పేర్కొన్న చిరునామాలో నన్ను సంప్రదించగలరు.ఆ డాక్యుమెంట్‌ను ఎవరు దుర్వినియోగం చేసినా చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి.

ఆర్.సూర్యకిరణ్, B.A., LL.B.,
అడ్వకేట్, ఎం.ఎస్.నెం.1389/2023,
3ఎ, లావణ్య అపార్ట్‌మెంట్స్, 20/80, 2వ ప్రధాన రహదారి,
గాంధీనగర్, అడయార్, చెన్నై- 600020